సాక్షి నంద్యాల

సోమవారం । 13 । అక్టోబర్ । 2025



స్తంభించిన నాపరాతి రవాణా

నాపరాళ్ల రవాణాకు సీనరేజ్ వసూలు చేసే బాధ్యత ప్రవేట్ సంస్థకు అప్పగించారు. దీంతో ఆదివారం నాపరాతి రవాణా స్తంభించింది. వాహనాలు ఎక్కడిక్కడే ఆగిపోయాయి. 8లో▶



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు.



హామీలు 'భద్రం'.. ప్రాజెక్టులు ఛిద్రం

రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెబుతున్నారే కానీ సాగు నీటి ప్రాజెక్టులపై దృష్టి సారించడం లేదు. దీంతో వరద నీరు సముద్రం పాలవుతోంది. 8లో▶

న్యూస్‌రీల్

శ్రీగిరి కిటకిట



మల్లన్న దర్శనానికి బారులుదీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో మల్లన్న దర్శనానికి తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకుని ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పులకించారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా వినతుల స్వీకరణ

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఈనెల 13న సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించవచ్చన్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తుల ప్రస్తుత సమాచారాన్ని meekosam. ap. gov. in వెబ్‌సైట్‌లో, టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించి తెలుసు కోవచ్చన్నారు. అర్జీదారు లందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సోమవా రం ఉదయం 9.30 గంటలకు జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కొత్తపల్లి: గుండెపోటుతో మృతి చెందిన కులు బండి వెంకటయ్య కుటుంబానికి స్నేహితులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-91లో కొక్కెరంచ గ్రామానికి చెందిన వెంకటయ్య పదవ తరగతి వరకు చదువుకున్నారు. ఇటీవల అతను గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల బృందం వెంకటయ్య కుటుంబాన్ని పరామర్శించి, అతడి భార్య పుస్తేల మణెమ్మకు రూ.1,10,000 ఆర్థిక సాయం అందజేశారు.

14న విద్యుత్ ఉద్యోగుల వర్క్‌టు రూల్

కర్నూలు(అగ్రికల్చర్): జేఏసీ పిలుపు మేరకు విద్యుత్ ఉద్యోగులు ఈ నెల 14న వర్క్ టు రూల్ ప్రకారం విధులు నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు తమ సమస్యలను పట్టించుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో 3500 మంది విద్యుత్ ఉద్యోగులు పనిచేస్తుండగా సోమవారం 2,500 మంది సెలవు పెట్టి చలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళ్లారు. కాగా.. ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లడానికి విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఇది వరకే నిర్ణయించింది.



- గ్రామీణ ప్రాంతాల్లో జోరుగా మద్యం విక్రయాలు
- అధికారపార్టీ నేతల అండతో దర్జాగా బెల్టు షాప్‌లు
- మద్యం సిండికేట్ నాయకుడి కొత్త దందా
- ప్రతి పల్లెలో రెండు, మూడు బెల్ట్ దుకాణాలకు అనుమతి
- రూ. కోటికి పైగా వసూలు

బెల్టు ఘాటుకు పల్లె తూలుతోంది!



చిరు దుకాణం.. ఎనీ టైం మద్యం

అధికార పార్టీ నేతల అండదండలతో పల్లెల్లో కొందరు చిరు దుకాణాల మాటున బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. బయట కిరాణం.. లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రధాన వీధుల్లోనే బెల్టు షాపులు నిర్వహిస్తుండటం, రాత్రయితే అక్కడ సందడి కనపడుతూ చుట్టు పక్కల ఉన్న వీధుల్లో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కిరాణ దుకాణాల్లో, సొంత ఇళ్లల్లో ఫ్రిడ్జ్‌లుపెట్టుకొని మరీ మద్యం విక్రయిస్తున్నారు. మద్యం మత్తులో ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర, గాంధీ జయంతి తదితర సెలవు రోజుల్లో ముందుగానే భారీగా స్టాక్ తెచ్చుకుని సెలవు దినాల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలను సాగిస్తున్నారు. ఇదంతా సాగుతున్న సంబంధిత అధికారులు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



మల్కాపురం గ్రామంలో బెల్టుషాపులో మద్యం విక్రయిస్తున్న మహిళ

డోన్: అధికార పార్టీ నేతల ధనదాహానికి పల్లెల్లో బెల్టు దుకాణాలు జోరందుకుంటున్నాయి. రెండు, మూడు వీధులకు ఒకటి చొప్పున బెల్టు షాపులు ఏర్పాటై మద్యం ఏటీఎంలను తలపిస్తున్నాయి. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ మండలాల పరిధిలో మొత్తం 123 గ్రామాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నూతన మద్యం పాలసీ అంటూ మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. డోన్ పట్టణంలో 4, గ్రామాల పరిధిలో రెండు, గీత కార్మికులకు ఒకటి, ప్యాపిలి మండల కేంద్రంలో రెండు, రాయలచెరువు క్రాస్ రోడ్డులో ఒకటి, బేతంచెర్ల మండల కేంద్రంలో నాలుగు, రంగాపురం, సిమెంట్‌నగర్, శంకలాపురం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున మద్యం దుకాణాలు ఉన్నాయి. నియోజకవర్గంలో మొత్తం 17 మద్యం దుకాణాలు ఉండగా బెల్టు దుకాణాలు మాత్రం 400కు పైగా ఉన్నాయంటే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. పట్టణ ప్రాంతాల్లో రాత్రి సమయంలో మద్యం దొరకదు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఏ మధ్య రాత్రి అయినా బెల్ట్ షాప్ తలుపు తట్టితే చాలు ఏటీఎంలా కావలసిన మద్యం చేతిలో ప్రత్యక్షమవుతోంది. డోన్, బేతంచెర్ల ప్రాంతాల్లో నాపరాళ్ల, మైనింగ్ పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ పని చేసే కార్మికులకు 24 గంటల పాటు మద్యం అందుబాటులో ఉండటంతో వారి కుటుంబాల్లో మద్యం చిచ్చు రేపుతోంది. కొందరు మద్యానికి బానిసై పనులకు వెళ్లకపోవడం, మరి కొందరు మద్యం మత్తులో ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. నియోజకవర్గంలో బెల్టు షాపుల వ్యాపారం మూడు ఫుల్‌లు, ఆరు క్వార్టర్లుగా కొనసాగుతోంది. చీప్ లిక్కర్ మొదలు, ముఖ్యమైన బ్రాండ్‌లు, బీర్లు లభిస్తుండటంతో రాత్రయితే పల్లెల్లో మినీ బార్లు వెలుస్తున్నాయి. పట్టణాలు, నగరాల్లో లేని విధంగా గ్రామాల్లో అర్ధరాత్రి సైతం మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో అటు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులపై దాడులు చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ. 25 వేలు ఇచ్చుకో.. బెల్టు షాప్ పెట్టుకో!

డోన్ పట్టణం కొండపేటకు చెందిన అధికార పార్టీ నేత బెల్ట్ షాప్‌లకు అధికార అనుమతి ఇచ్చేస్తున్నాడు. పల్లెల్లో ఎవరైనా బెల్ట్ దుకాణం నిర్వహించాలనుకుంటే రూ. 25 వేలు చెల్లిస్తే చాలు అంటూ బహిరంగ ఆఫర్ ప్రకటించాడు. ఇతను గతంలో నకిలీ మద్యం కేసులో నిందితుడు. ప్రస్తుతం మద్యం దుకాణాల సిండికేట్ పెద్దగా వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో పల్లెల్లో బెల్ట్‌షాప్ ఏర్పాటు చేయాలంటే తన అనుమతి ఉండాల్సిందేనని డబ్బులు తీసుకుంటున్నాడు. నియోజకవర్గంలో సుమారు 400కు పైగా బెల్ట్ దుకాణాలు ఉన్నట్లు సమాచారం. ఒక్కొక్క కార్యకర్తకు ఒక బెల్టుషాపు చొప్పున గ్రామంలో రెండు నుంచి ఐదు వరకు ఏర్పాటు చేసుకునేందుకు ఒక్కొక్క వ్యక్తి నుంచి రూ.25 వేల చొప్పున అక్రమంగా వసూలు చేశాడు. దాదాపు రూ. 70 లక్షల నుంచి రూ. కోటి వరకు దర్జాగా తీసుకున్నట్లు తెలుస్తోంది. సివిల్, ఎక్సైజ్ పోలీసులు దాడులు చేయకుండా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇలా వసూలు చేసిన సొమ్మును ఒక్కడే మింగేసినట్లు సమాచారం. కాగా డోన్ పట్టణానికి 5 కి.మీ దూరంలో ఉన్న కొచ్చెర్వు గ్రామంలో ఐదుగురు వ్యక్తులు బెల్ట్ షాప్‌ల నిర్వహణకు రూ. 25 వేల చొప్పున చెల్లించారు. అయితే వ్యాపారం జరగకపోవడంతో తమకు బెల్ట్ షాప్ వద్దని, డబ్బులు తిరిగి ఇవ్వాలని ముగ్గురు వ్యక్తులు కోరారు. అయితే ఆ అధికార పార్టీ నేత మాత్రం బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం.





డోన్ గుత్తిరోడ్డులో బెల్టుషాపు, నంద్యాల రైల్వే గేటు వద్ద బెల్టుషాపు నిర్వహిస్తున్న దృశ్యం

కుటుంబాలు వీధిన పడుతున్నాయి



అధికార పార్టీ నాయకుల ధన దాహంతో సామాన్య, పేదల కుటుంబాలు వీధిన పడుతున్నాయి. పల్లెల్లో బెల్ట్‌షాపులు ఏర్పాటు చేయడంతో కొందరు మద్యానికి బానిసలవుతున్నారు. రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్మును మద్యానికి పెట్టాల్సి వస్తోంది. పేదలకు మెరుగైన వైద్యం, విద్యనందించాల్సిన కూటమి ప్రభుత్వం మద్యాన్ని బెల్ట్‌షాప్‌ల ద్వారా డోర్ డెలివరి చేయడం ఎంత వరకు సమంజసం.

– సుమలత సురేష్, వార్డు కౌన్సిలర్, డోన్

పేదల ప్రాణాలతో చెలగాటం



కూటమి ప్రభుత్వం సంపద సృష్టి అంటూ పేదల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మద్యం విక్రయాలను నియంత్రిస్తూ సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుకు దశల వారీగా ప్రయత్నిస్తే కూటమి ప్రభుత్వం ఊరూరా బెల్ట్ షాప్‌లు నడపుతుండటం దారుణం. పల్లెల్లో జనావాసాల మధ్య మద్యం విక్రయాలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం

– వసుల కీర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షురాలు

ప్రధాని పర్యటనకు పటిష్ట బందోబస్తు



శ్రీశైల ఆలయం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 16న భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను పురస్కరించుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ తెలిపారు. ఆదివారం ఆయన శ్రీశైలంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాని పర్యటించే ప్రదేశాలైన హెలిపాడ్, సున్నిపెంట నుంచి శ్రీశైలం రోడ్డు మార్గం, భ్రమరాంబా అతిథిగృహం, ఆలయ పరిసరాలు తదితర ప్రాంతాల్లో ఎస్పీ పర్యటించి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రధాని ఈ నెల 16న శ్రీశైలం చేరుకుని శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకోనున్నారని, ఈ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే శ్రీశైలం పరిసరాలు, నల్లమల అడవుల్లో గ్రేహౌండ్స్ సాయుధ బలగాలతో కూంబింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, శ్రీశైలం, సున్నిపెంట సీఐలు ప్రసాదరావు, చంద్రబాబు ఉన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు కల్చరల్: జిల్లాలో ఈనెల 16న ప్రధాని నరేంద్రమోదీ పర్యటించనున్నారని, ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదేశించారు. నన్నూరు టోల్ గేట్ వద్ద సభా ప్రాంగణం, హెలిపాడ్ ఏర్పాట్లను ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధాని వచ్చే దారిలో బ్యారికేడింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. సభ ప్రాంగణంలో హెలిపాడ్ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పరిశీలించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లి ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశానికి చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులకు సూచించారు. పార్కింగ్ ప్రాంతాల్లో ఆయా నియోజక వర్గాల ఇండికేషన్ సైనింగ్ బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

- పూర్ణాహుతితో ఘనంగా ముగిసిన అహోబిల పవిత్రోత్సవాలు
- గోవింద నామస్మరణతో హోరెత్తిన నల్లమల



తిరుమంజనంలో కొలువైన ఉత్సవ మూర్తులు శ్రీప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు



పవిత్ర హోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో వెలసిన శ్రీప్రహ్లాదవరదస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు ఆదివారం తెల్లవారుజామున పూర్ణాహుతితో ముగిశాయి. శనివారం రాత్రి నుంచి వైభవోపేతంగా పూజలు ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి శ్రీ రంగరాజ యతీంద్ర మహాదేశికన్ స్వామీజీ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదులకు ముందుగా గ్రామోత్సవం, రాత్రి నిత్యపూజ అనంతరం శాంతి హోమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, అర్ధరాత్రి అనంతరం ఉత్సవ మూర్తులైన స్వామి అమ్మవార్లకు తిరుమంజనం, సంప్రోక్షణం చేపట్టారు. ఆదివారం తెల్లవారు జామున శాత్తుమురై గోష్టితో పవిత్రోత్సవ కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమాలను అహోబిలం ప్రధానార్చకులు శ్రీమాన్ శఠకోప వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాయణ్ ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాల నుంచి ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన వేద పాఠశాలల పండితులు నిర్వహించారు. ఏడాది పొడువునా ఆలయంలో నిర్వహించే నిత్య కైంకర్యాలు, వార, మాస, వార్షిక మహోత్సవాలు, ఇతరత్రా పూజాది కార్యక్రమాల్లో తెలసీ తెలియక చేసిన తప్పుల వలన ఏర్పడిన దోషాలకు నివారణగా ఏటా నియమనిష్టలతో పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ ప్రదేశాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ముల్లె సర్దుకున్నాం.. వెళ్లిపోతున్నాం



గుడి కంబాలి నుంచి వాహనంలో వలస వెళ్తున్న ప్రజలు

కోసిగి: జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి బతుకు తెరువు కోసం పిల్లా పాపలతో కలిసి మూటాముల్లె సర్దుకుని ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఖరీఫ్ సీజన్ ముగియక ముందే ఈ ఏడాది పనుల కోసం కూలీలు, రైతులు వలసబాట పట్టారు. కర్నూలు, పత్తికొండ, కోడుమూరు, ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో పంటలన్నీ పూర్తిగా దెబ్బతిని రైతులకు తీరని నష్టం మిగిలింది. ఏటా పనులు ముగించుకున్న తర్వాత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. ఈఏడాది ఖరీఫ్ పూర్తికాక ముందే కోసిగి, కౌతాళం మండలాల నుంచి పక్షం రోజులుగా వివిధ వాహనాల్లో కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు తరలి వెళ్లుతున్నారు. ఆదివారం కోసిగి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 30కి పైగా టెంపోల్లో 1,500 మందికి పైగా కూలీలు తరలి వెళ్లారు. ఇందులో కొందురు కర్ణాటక రాష్ట్రంలోని సైదాపూర్, గబ్బూర్, మటమారి, మర్చటాల్ ప్రాంతాలకు తెలంగాణ ప్రాంతంలో పలు ప్రాంతాలకు తరలి వెళ్లారు.

విద్యార్థులూ.. వీరగాథలు రాద్దాం రండి!

- కేటగిరీలుగా వివిధ అంశాలపై నిర్వహణ
- నాలుగు విభాగాల్లో విద్యార్థులకు పోటీలు
- 3 నుంచి 12 తరగతుల వారికి పలు పోటీలు
- ఈనెల 31తో ముగియనున్న గడువు
- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



వీరగాథ 5.0 పెయింటింగ్ వేస్తున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు దేశభక్తిని పెంపొందించేందుకు జాతీయ విద్యా, రక్షణ శాఖలు సంయుక్తంగా వీర గాథ 5.0 పేరుతో ఆయా విభాగాల్లో పోటీలను నిర్వహిస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తుంది. 3 నుంచి 12వ తరగతి (ఇంటర్) వరకు విద్యార్థులకు నాలుగు విభాగాల్లో పోటీలు చేపడుతున్నారు. విద్యార్థులు దేశభక్తిని పెంపొందిస్తూ, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరుల గాథలను వివరించడం, వారి త్యాగాలను తెలిపేలా విద్యార్థులకు పద్యాలు, కథలు, చిత్రలేఖనం, వ్యాస రచన, మల్టీమీడియా ప్రదర్శన వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. వివిధ పోటీల్లో పాల్గొనే వారికి ఈ నెల 31వ తేదీ గడువు ఇచ్చారు. ఇప్పటికే ఈ పోటీలకు సంబంధించి జిల్లా విద్యా శాఖ ఆయా పాఠశాలలకు ఉత్తర్వులు జారీ చేశారు. వీరగాథ 5.0 పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వారికి నచ్చిన అంశాలను ఎంచుకునే అవకాశాన్ని కల్పించారు. దేశం కోసం అత్యున్నత త్యాగం చేసిన వారిని రోల్ మోడల్‌గా ఎందుకుని, వారి నుంచి నేర్చుకున్న విలువలను ప్రస్తావించాలి. ఆ విద్యార్థికి అవకాశమిస్తే ఏం చేయదలిచాడో చెప్పాలి. ఉదాహరణకు ఝాన్సీ లక్ష్మీబాయి కలలోకి వచ్చి దేశానికి సేవ చేయాలని కోరితే ఏం చేస్తాడో వివరించవచ్చు. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటును తాను ఆదర్శంగా తీసుకున్న స్వాతంత్ర్య సమరయోధుల జీవిత కథలు విద్యార్థిపై ఎలా ప్రభావితం చేసిందో చెప్పాల్సి ఉంటుంది. అలాగే స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల తిరుగుబాటు పాత్ర, ఇతర అంశాలను ఎంపిక చేసుకుని వివరించవచ్చు.



వీరగాథ 5.0 లోగో

నాలుగు విభాగాల్లో..

జిల్లాలోని పాఠశాలల వారీగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. 3–5 తరగతులకు ఓ విభాగంగా, 6–8, 9–10, 11–12 తరగతులకు వేర్వేరు కేటగిరీలుగా విభజించారు. 3–5 తరగతుల వారికి పద్యం, కథ (150 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్, 6–8 తరగతుల వారికి పద్యాలు/ కథ(300 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీమీడియా ప్రదర్శన. 9–10 తరగతుల వారికి పద్యాలు, వ్యాసం (700 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీమీడియా ప్రదర్శన. 11–12 తరగతుల వారికి పద్యాలు, వ్యాసం (వెయ్యి పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీ మీడియా ప్రదర్శన ఉంటుంది. ఒకటి లేదా రెండు నిమిషాల నిడివితో దేశభక్తికి సంబంధించిన ప్రదర్శన వీడియో రూపంలో ఇవ్వడమే మల్టీమీడియాగా పరిగణిస్తారు.

నమోదు విధానం ఇలా..

ఆయా పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయులు కేటగిరీలుగా, తరగతుల వారీగా పోటీలు నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు పోటీలు నిర్వహించి, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఇందుకు ఇన్నోవేటివ్ ఇండియా మై జీవోవీ, ఇన్/వీర్ గాథ 5.0 అనే వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. సబ్మిట్ యువర్ ఎంట్రీ అని ఉన్న చోట క్లిక్ చేసి వివరాలను నమోదు చేయాలి. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల నుంచి అత్యుత్తమమైన నాలుగు ఎంట్రీలను అప్‌లోడ్ చేయాలి. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమంగా ఎంపిక చేసిన వాటిని జాతీయ స్థాయికి పంపిస్తారు. జాతీయ స్థాయిలో ఒక్కో విభాగంలో 25 మంది వంతున అత్యుత్తమ ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదు పారితోషికాన్ని, ప్రశంసాపత్రాన్ని అందజేస్తారు.

ప్రతిభ కనబరుస్తూ..

నంద్యాల జిల్లా పరిధిలో ఉన్న 1,849 ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 2,77,625 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో తరగతులు, కేటగిరీల వారీగా ఉపాధ్యాయులు పోటీలు నిర్వహిస్తున్నారు. పలువురు విద్యార్థులు సొంతంగా దేశభక్తిని పెంపొందించేలా చిన్న వీడియోలు రూపొందిస్తున్నారు.

పోటీలతో సృజనాత్మకత వెలికి



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత ఈ పోటీల ద్వారా బయటకు వస్తుంది. వీరగాథ 5.0 పోటీలను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు నిర్వహించిన పోటీలు, మల్టీమీడియా వీడియోలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

– జనార్దన్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

వీరగాథలు స్ఫూర్తితో నింపేలా పోటీలు నిర్వహించాలి



విద్యార్థులు దేశ భక్తిని చాటేలా వీరుల గాథలు వారిలో స్ఫూర్తి నింపేలా పోటీలు నిర్వహించాలి. విద్యార్థుల ప్రతిభ జాతీయ స్థాయిలో కనబరిచేలా ఉపాధ్యాయులు విద్యార్థులను మార్గదర్శకత్వం చేయాలి. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసే చక్కటి కార్యక్రమం. వీరగాథ 5.0 కార్యక్రమం విద్యార్థుల్లో దేశ భక్తిని పెంపొందిస్తుంది. విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రేమాంతకుమార్, అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్, సమగ్రశిక్ష, నంద్యాల

క్లుప్తంగా

జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



మూడో స్థానంలో నిలిచి మెడల్, ప్రశంసా పత్రం అందుకుంటున్న ధన ధీరజ్

కర్నూలు టౌన్: ఈనెల 9 వ తేదీ నుంచి 12 వ తేదీ వరకు మైసూర్‌లోని గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో నిర్వహించిన 50 వ జాతీయ స్థాయి సీనియర్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో కర్నూలుకు చెందిన ధన ధీరజ్ మూడో స్థానం సాధించారు. దీంతో ఏషియన్ యోగ ఫెడరేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్ ఆగర్వాల్, యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అభినవ్ జోషి చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెడల్స్ అందించి అభినందించినట్లు జిల్లా యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి అవినాష్ శెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పతకం సాధించిన క్రీడాకారుడిని ఆదివారం యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంత రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముంతాజ్ బేగ్ అభినందనలు తెలిపారు.

కొరియర్ వాహనం బోల్తా



కాల్వ వద్ద బోల్తా పడిన వాహనం

అవుకు(కొలిమిగుండ్ల): పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో కొత్త కాల్వ వద్ద ఆదివారం కొరియర్ వాహనం బోల్తా పడింది. బనగానపల్లె నుంచి తాడిపత్రికి వెళుతున్న ఇంటర్నేషనల్ డొమెస్టిక్ కొరియర్‌కు చెందిన మినీ వాహనం కొత్త కాలువ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. పక్కనే ఉన్న కాల్వలో వాహనం పడి ఉంటే ప్రమాద తీవ్రత పెరిగి ఉండేది.

యువకుడి ఆత్మహత్య

దువ్వూరు: వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం ఇడమడక గ్రామ సమీపంలోని పాడుబడిన దాబా వద్ద ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం యాదవ వాడకు చెందిన అరుణ్‌కుమార్ (19) అనే యువకుడు ఆళ్లగడ్డలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం రాత్రి మండలంలోని ఇడమడక గ్రామ సమీపంలోని హైవేపై ఉన్న పాడుబడిన దాబా వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో ఆదివారం ఉదయం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువకుడి ప్రేమ వ్యవహారం కుటుంబ సభ్యులకు తెలియడంతో భయపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు దువ్వూరు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్ పరిధిలోని మంత్రాలయం బ్రిడ్జి కిలోమీటర్ నంబర్ 536/9–11 అప్ లైన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ గోపాల్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించాడు. మృతుడి మెడలో రుద్రాక్ష మాల, కుడి చేయి రెట్టపై త్రిశూలం అకారంలో పుట్టు మచ్చ, కుడి చేతిపై పీకే అని, ఎడమ చేతిపై ఎస్పీ అని పుట్టుమచ్చలు ఉన్నాయి. ఎవరైనా మృతుడిని గుర్తు పట్టకలిగితే తమను సంప్రదించాలని రైల్వే ఎస్ఐ వెల్లడించారు.

హామీలు 'భద్రం'.. ప్రాజెక్టులు ఛిద్రం

- వరద నీటిని వినియోగించుకోని కూటమి ప్రభుత్వం
- వృథా అయిన తుంగభద్ర నది జలాలు
- పూర్తికాని ఆర్‌డీఎస్ కుడి కాలువ
- వేదావతి ప్రాజెక్టులను పట్టించుకోని వైనం
- రైతులకు మిగిలింది కన్నీటి' కష్టాలే!



సుంకేసుల నుంచి వృథాగా పోతున్న తుంగభద్ర జలాలు



ఆర్డీఎస్ కుడి కాలువకు నిర్మించిన హెడ్‌వర్క్

కర్నూలు సిటీ: "రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేస్తాం.. ప్రతి ఎకరానికి నీరిస్తాం.. కరువును శాశ్వతంగా తరిమేస్తాం" అని ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. అధికారంలోకి వచ్చి ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. సీఎంగా పలు సభల్లోనూ రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేస్తున్నాం అంటున్నారు. అయితే వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంది. తుంగభద్ర నదికి వచ్చిన వరద నీటిని వినియోగించుకోలేకపోయారు. వచ్చిన నీటిని వచ్చినట్టే కిందకు వదిలేశారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకపోవడం ఈ దుస్థితి నెలకొంది. తుంగభద్ర నదిపై గుండ్రేవుల ప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడి కాలువ, హగేరి నదిపై వేదావతి ప్రాజెక్టులు చేపట్టేందుకు అవకాశాలు ఉన్నాయి. అయితే ఎన్నికల సమయంలో వాటిని టీడీపీ నేతలు ప్రచార అస్త్రాలుగా వాడుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ప్రాజెక్టులపై దృష్టికి సారించలేదు.

నీరు నిల్వలేక నిర్వేదం

ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలకు ప్రధాన జలవనరు తుంగభద్ర నది. ఈ నది జలాలపై ఆధారపడి కేసీ కింద 2.65 లక్షలు, తుంగభద్ర దిగువ కాలువ కింద 1.51 లక్షల ఎకరాలు సాగులో ఉన్నాయి. అలాగే ఈ నదిపై 50కిపైగా ఎత్తిపోతల పథకాలు ఉండగా 36 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. తుంగభద్ర నదిలో ఏటా 250 నుంచి 400 టీఎంసీలకుపైగా నీటి లభ్యత ఉంది. ఇందులో 10 శాతం నీటిని కూడా వినియోగించుకోని పరిస్థితులు ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ ఏడాది 333 టీఎంసీల తుంగభద్ర జలాలు వృథా అయినట్లు సమాచారం. తుంగభద్ర నదిపై గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మించి ఉంటే 20 టీఎంసీలు, ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మిస్తే 4 టీఎంసీలు, హగేరిపై వేదావతి స్కీమ్ పూర్తి చేస్తే 8 టీఎంసీల నీరు వాడుకునే అవకాశం ఉండేది.

మాటలు.. నీటి మూటలు!

కర్నూలు–కడప కాలువ కింద 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే 259 గ్రామాలకు తాగు నీరు అందుతోంది. కేసీ కాలువకు 39.9 టీఎంసీల తుంగభద్ర నీటిని కేటాయించినా నిల్వ చేసుకునేందుకు అవసరమైన రిజర్వాయర్లు లేవు. సుంకేసులలో 1.2 టీఎంసీలు, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 2.965 టీఎంసీలకు మాత్రమే నిల్వ చేయవచ్చు. కేసీ ఆయకట్టుకు రెండు పంటలకు నీరు ఇవ్వాలంటే గుండ్రేవుల అవసరమని 2014లో మొదటగా రూ.2,400 కోట్లతో అంచనాలు వేశారు. 2019 ఎన్నికలకు నెలన్నర ముందు పరిపాలన అనుమతులు ఇచ్చి..నామమాత్రంగానే శంకుస్థాపన చేసి వదిలేశారు. 2024 ఎన్నికల సమయంలో నారా లోకేష్ పాదయాత్రలో, ఎన్నికల ప్రచారం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కచ్చితంగా గుండ్రేవుల నిర్మించి తీరుతామని హామీనిచ్చారు. అసెంబ్లీ సమావేశాల్లో గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మిస్తామని టీడీపీ మంత్రి చెప్పిన మాటకే నీటి మూట అయ్యింది.

నిధులు ఇవ్వలేక..

మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 40 వేల ఎకరాల ఆయకట్టుకు 4 టీఎంసీల సాగు నీటిని అందించేందుకు ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టును రూ.1,985.42 కోట్లతో గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్ట కుడి వైపు హెడ్‌వర్క్, కొంత కాలువ పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాన ఏడాదిగా పనులు నిలిపి వేసింది. పనులకు ఈ ఏడాది జూలైలో గ్రీన్ ఇచ్చినా నిధులు ఇవ్వక లేదు. దీంతో పనులు మొదలు కాలేదు.

ప్రకటనకే పరిమితం

ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లోని 80 వేల ఎకరాలకు హగేరి నది నుంచి సాగు నీటిని అందించేందుకు వేదావతి లిఫ్టును రూ.1942.80 కోట్లతో గత ప్రభుత్వం పనులు మొదలు పెట్టింది. స్టేజ్–1, స్టేజ్–2 పనులు సుమారు రూ.106.2 కోట్ల పనులు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు నిలిపి వేశారు. తిరిగి పనులు మొదలు పెట్టేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపినా అది కేవలం ప్రకటనకు మాత్రమే పరిమితం అయ్యాయి.



అసంపూర్తిగా వేదావతి స్టేజ్-2 పంప్ హౌస్

గుండ్రేవులపై వివాదం ఉంది

తుంగభద్ర నదిపై నిర్మించాలనుకున్న గుండ్రేవుల ప్రాజెక్టు విషయంపై వివాదం ఉంది. ఈ ప్రాజెక్టు ప్రస్తావన అసెంబ్లీలో వచ్చిందే. ఇంకేమీ లేదు. ఆర్డీఎస్ కుడి కాలువ, వేదావతి ప్రాజెక్టుల పనులు మొదలు పెట్టేందుకు ప్రభుత్వం అంగీకరించింది. రూ. 30 కోట్ల నిధులు కూడా ఇస్తామని చెప్పారు. పనులు త్వరలోనే మొదలు కానున్నాయి.

– కబీర్ బాషా, జల వనరుల శాఖ, కర్నూలు ప్రాజెక్టు సీఈ

ఉడుము కనిపించెన్!



నీటి కాల్వ వద్ద ఉడుము

దొర్నిపాడు: ఉడుము ఒకప్పుడు పల్లెల్లో తరచూ కనిపించేవి. ప్రస్తుతం వాటి సంతతి కనుమరుగవుతుండటంతో చాలా అరుదుగా కనిపిస్తున్నాయి. ఆదివారం దొర్నిపాడు పొలాల్లో మూడు అడుగుల పొడవైన ఉడుము ఆహార అన్వేషణలో భాగంగా పరుగులు తీస్తూ ఓ కల్వర్టు వద్ద ఆగిపోయింది. పొడవాటి మెడ, బలమైన కాళ్లు, శక్తివంతమైన తోక, పదునైన పళ్లతో కనిపించింది. పొలాల్లో, చిత్తడినేలలు, నదుల దగ్గర ఇవి నివసిస్తాయి. మాంసాహారులు కావడంతో కీటకాలు, చిన్న సరీసృపాలు, పక్షులు, వాటి గుడ్లను ఆహారంగా తీసుకుంటాయి. అప్పట్లో పెద్దలు ఏదైనా బలం ప్రదర్శించాలంటే ఉడుం పట్టు పట్టాలి అనే సామెతను వాడేవారు. వాటి కాళ్లలో అంత పట్టుత్వం ఉంటుంది. గతంలో కొందరు ఉడుము మాంసం తినేవారు. అంతరించిపోతున్న జాతుల్లో ఇది చేరడంతో దీనిని వేటాడితే వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేస్తారు.

వైభవంగా మాల మల్లేశ్వర విగ్రహ ప్రతిష్ఠ



బీరప్పస్వాముల ఊరేగింపుల్లో పాల్గొన్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

పత్తికొండ: పట్టణంలో నూతనంగా నిర్మించిన అలయంలో మాల మల్లేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం వేద పండితులు హోమం నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన బీరప్ప స్వాములు ఆదోని రహదారిలో హంద్రీ నీవా కాలువ దగ్గర గంగపూజ చేపట్టారు. అనంతరం పట్టణంలోని పుర వీధుల్లోకి సంప్రదాయ నృత్యంతో బీరప్పస్వాములును నూతన అలయం దగ్గరకు తీసుకొచ్చారు. కాగా మాల మల్లేశ్వర స్వాములు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హిందూపురం మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి కురువలు అధిక సంఖ్యలో తరలిరావడంతో కొండగేరి, గాంధీ నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రాణం తీసిన నిద్రమత్తు

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

ఆళ్లగడ్డ: అతి వేగం, ఆపై నిద్రమత్తు ఒకరిని బలితీసుకుంది. కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై ఆళ్లగడ్డ పట్టణ పరిధిలోని గూబగుండం మెట్ట సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆళ్లగడ్డ పట్టణ ఎస్ఐ జయన్న తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా కమలాపురానికి చెందిన పిచ్చిరెడ్డి తిరుపతిలోని ఓ కారు షో రూంలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కొత్త కారును కొనుగోలు చేయడంతో పిచ్చిరెడ్డి ఆ కారును డెలివరీ ఇచ్చేందుకు శనివారం అర్ధరాత్రి తర్వాత బయలుదేరాడు. మార్గమధ్యలో కడప దగ్గర నంద్యాలకు వెళ్లేందుకు నజీర్ హుస్సేన్, శ్రీను అనే ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. ఈ క్రమంలో ఆళ్లగడ్డ పట్టణ శివారులోని గూబగుండం మెట్ట సమీపంలోకి వచ్చే సరికి కారు నడుపుతున్న పిచ్చిరెడ్డి నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు సీటులో కూర్చున్న నజీర్‌హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందగా పిచ్చిరెడ్డి, శ్రీను తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని నంద్యాల వైద్యశాలకు తరలించారు. మృతి చెందిన నజీర్ హుస్సేన్‌ది కడప వాసిగా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన నజీర్

కొత్త టీచర్లొస్తున్నారు!

- ఉమ్మడి జిల్లాలో 2,590 మంది టీచర్ పోస్టులు భర్తీ
- పాఠశాల విద్యలో 2557, ట్రైబల్‌లో 33 మంది
- నేడు రిపోర్టు చేసుకోనున్న నూతన టీచర్లు



కర్నూలు సిటీ: డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త టీచర్లు నేటి నుంచి విధుల్లో చేరనున్నారు. ఉమ్మడి జిల్లాలో 2,590 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. ఇందులో పాఠశాల విద్యలో 2557, ట్రైబల్ స్కూళ్లలో 33 పోస్టులు ఉన్నాయి. ఉద్యోగాలకు ఎంపికైన వారందరికీ ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ ఇచ్చారు. ఈ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారిలో సెకండరీ గ్రేడ్ టీచర్లకు మ్యానువల్‌గా, స్కూల్ అసిస్టెంట్‌లకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఉమ్మడి జిల్లాలో ఖాళీగా గుర్తించిన స్కూళ్లలో టీచర్లుగా నియమించారు. ఆర్డర్ కాపీలు ఆదివారం డౌన్‌లోడ్ అయ్యాయి. వీరందరూ ఆయా మండల విద్యాధికారుల దగ్గర నేడు రిపోర్ట్ చేసుకోవాలి. స్కూల్ అసిస్టెంట్లు అయితే వారు ఎంచుకున్న హైస్కూల్‌లోని ప్రధానోపాధ్యాయుల దగ్గర రిపోర్ట్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శ్యామూల్ పాల్ ఆదేశాలు జారీ చేశారు.

ఇంకా 2,300కిపైగా టీచర్ పోస్టులు ఖాళీ

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల స్కూల్స్ 2,778 ఉన్నాయి. ఈ స్కూళ్లకు 16,898 మంది టీచర్లు అవసరం. కానీ 12,191 మంది రెగ్యులర్ టీచర్లు మాత్రమే పని చేస్తున్నట్లు విద్యాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాకు సుమారుగా 4,707 మంది టీచర్లు అవసరం ఉంది. అయితే మెగా డీఎస్సీ ద్వారా పాఠశాల విద్యలో 2,557 మంది టీచర్లను భర్తీ చేశారు. ఇంకా 2,150 టీచర్లు ఉమ్మడి జిల్లాకు కావాలి. దీంతో పాటు ఈ ఏడాది జూన్ నుంచి రిటైర్ అయిన వారితో కలిపితే 2,300కిపైగా టీచర్ పోస్టులు ఖాళీ ఉండనున్నట్లు తెలుస్తుంది. ఇందులో ఒక్క ఎస్‌జీటీ పోస్టులే సుమారు 1,300 వరకు ఉండొచ్చునని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేసిన టీచర్ పోస్టులన్నీ 3,4 క్యాటగిరీ స్కూళ్లలోని ఖాళీల్లోనే భర్తీ చేశారు.

ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలి

కర్నూలు సిటీ: కేంద్రం సకాలంలో కరువు భత్యం చెల్లిస్తున్నా.. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చెల్లించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమని పీఆర్‌టీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారంలో నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎస్.వి కృష్ణారెడ్డి, నంద్యాల జిల్లా కమిటీ అధ్యక్షుడు రాంపక్కిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటిందని, ఇప్పటి వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న కేంద్రంలో ఒకలాగా, రాష్ట్రంలో ఒకలాగా చూపే ఢబుల్ ఇంజన్ సర్కార్ ధోరణి మారాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు చెల్లించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని, ప్రభుత్వం స్పందించకుంటే పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీ కలిసొచ్చే సంఘాలతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఆ సంఘం నాయకులు ధనుంజయ, సయ్యద్, చాంద్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, రవి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఈతకెళ్లి యువకుడు గల్లంతు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పేండేకల్లు గ్రామంలో బావిలో ఈతకెళ్లిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సాలె పుల్లన్న, సాలమ్మ దంపతుల చిన్న కొడుకు చిన్న కుల్లాయి (22) స్థానిక కప్పల బావి వద్దకు ఈతకెళ్లాడు. బావిలో దిగిన యువకుడు ఎంతసేపటికి బయటకు రాలేదు. గమనించిన తోటి యువకులు బావిలో దూకి ఎంత గాలించినా కనిపించలేదు. చివరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని వెలికి తీసే చర్యలు చేపట్టారు.

జీవ పరిణామం నిరంతర ప్రక్రియ



మాట్లాడుతున్న డాక్టర్ కాలేషా బాషా

కర్నూలు(హాస్పిటల్): జీవ పరిణామం నిరంతర ప్రక్రియ అని, మనిషి మూలాలన్నీ ఆఫ్రికన్ నుంచే బయలుదేరి కొన్ని వందల వేల సంవత్సరాల తర్వాత ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాయని జనవిజ్ఞాన వేదిక నాయకులు, జనరల్ సర్జన్ డాక్టర్ కాలేషా బాషా చెప్పారు. నగరంలోని డాక్టర్ బ్రహ్మారెడ్డి హాస్పిటల్‌లోని కాన్ఫరెన్స్‌లో వైద్య విద్యార్థులకు నిర్వహిస్తున్న రెండు రోజుల హ్యాండ్స్ ఆన్ ట్రెనింగ్ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ కాలేషా బాషా మాట్లాడుతూ.. మనిషి జీవన పరిణామక్రమం గురించి వివరించారు. డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడారు. జేవీవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సురేష్‌కుమార్, రాష్ట్ర నాయకులు మహమ్మద్ మియ్యా, గోపాల్ నాయక్, రమణయ్య, శ్రీరాములు, ధనుంజయ్, మీనా, బాషా, వీరేష్ పాల్గొన్నారు.



వేదికపై ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆత్మీయ కలయిక..ఆనంద డోలిక!

ఆలూరు రూరల్: గుర్తుకొస్తున్నాయ్.. అంటూ 27 ఏళ్ల తర్వాత వారంతా కలుసుకున్నారు. పట్టణంలోని ఎల్లార్తి రోడ్డులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1997–98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్నేహితులంతా ఒకేచోట చేరడంతో కుశల ప్రశ్నలు వేసుకొని ఉల్లాసంగా గడిపారు. నాటి స్మృతులను గుర్తుకు తెచ్చుకొని, మళ్లీ చిన్నపిల్లలైపోయారు. అలాగే నాడు వారికి విద్యాబుద్ధులు చెప్పిన గురువులు రుక్మిణి, రమణయ్య, మహబూబ్ సాబ్‌ను ఘనంగా సత్కరించారు. నాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో సరస్వతి ఆలయం నిర్మించడం అభినందనీయం అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులకు షీల్డులు అందజేశారు.

రూ.100కే కిలో చికెన్

కోడుమూరు రూరల్: ఇద్దరు వ్యాపారస్తుల మధ్య నెలకొన్న పోటీతో ఆదివారం చికెన్ చౌక ధరకు లభించింది. కోడుమూరులోని బళ్లారి రోడ్డులో ఇటీవల కర్నూలుకు చెందిన ఓ వ్యాపారి నూతనంగా చికెన్ వ్యాపారం ప్రారంభించాడు. తన వ్యాపారం వృద్ధి చేసుకునేందుకు మార్కెట్ రేటు కంటే తక్కువకు చికెన్ అమ్మకాలను చేపట్టాడు. దీంతో అప్పటికే చికెన్ వ్యాపారం చేస్తున్న మరో వ్యాపారి కూడా ఆ వ్యాపారి ఇచ్చే రేటు కంటే తక్కువగా చికెన్ అమ్ముతూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కర్నూలుకు చెందిన వ్యాపారి కిలో చికెన్ రూ.110 పెట్టగా, స్థానిక పాత వ్యాపారి రూ.10 తగ్గించి రూ.100కే కిలో చికెన్ అంటూ బోర్డు పెట్టాడు. దీంతో జనం బారులు తీరారు. పట్టణ వాసులతో పాటు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సైతం కోడుమూరుకు వచ్చి చికెన్ కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో చికెన్ ధర రూ.180 పలుకుతుండగా, స్కిన్ లెస్ చికెన్ రూ.200 పలుకుతోంది.

భార్యతో గొడవ పడి ఆత్మహత్య



మృతి చెందిన జయరాజు

పాములపాడు: ఇస్కాల గ్రామంలో భార్యతో గొడవ పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మకూరు మండలం పెద్దనంతాపురం గ్రామానికి చెందిన జయరాజు(40)తో ఇస్కాలకు చెందిన లక్ష్మీదేవికి 19 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు. మూడు రోజుల క్రితం భర్తతో గొడవ పడి లక్ష్మీదేవి పుట్టినిల్లు ఇస్కాలకు చేరుకుంది. భార్యను తిరిగి తీసుకెళ్లేందుకు శనివారం జయరాజు అత్తింటికి చేరుకున్నాడు. అదే రోజు వారి మధ్య మళ్లీ ఘర్షణ చోటు చేసుకుంది. భర్త మాట వినకుండా తెలంగాణ ప్రాంతంలో పత్తి విడిచే పనుల కోసం గ్రామస్తులతో కలిసి వెళ్లింది. వద్దని చెప్పినా భార్య పనులకు వెళ్లడంతో మనస్తాపానికి గురైన జయరాజు ఇస్కాలలోనే ఓ పాత పురిగుడిసెల్లో ఆదివారం ఉదయం ఉరి వేసుకున్నాడు. గమనించిన స్థానికులు కాపాడేలోపు మృతి చెందాడు. మృతుడి తల్లి దీవెనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

స్తంభించిన నాపరాతి రవాణా



బేతంచెర్లలో ప్రైవేటు చెక్ పోస్టు వద్ద నిలిచిపోయిన నాపరాళ్ల ట్రాక్టర్లు

కొలిమిగుండ్ల: నాపరాళ్ల రవాణాకు సీనరేజ్ వసూలు చేసే బాధ్యత ప్రవేట్ సంస్థకు అప్పగించడంతో ఆదివారం నాపరాతి రవాణా స్తంభించింది. ట్రాక్టర్, లారీలకు ప్రతి ట్రిప్పుకు టన్నుల ప్రకారం సీనరేజ్ చెల్లించాల్సి వస్తోంది. దీంతో యజమానులు నాపరాతి గనుల్లోంచి రాళ్లను ఎగుమతి చేయకపోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు, ట్రాక్టర్, లారీ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల, అవుకు మండలాల నుంచి ప్రతి రోజు ట్రాక్టర్లు 300, లారీలు 30 మేర ఇతర ప్రాంతాలకు నాపరాళ్లను ఎగుమతి చేస్తుంటారు. సీనరేజ్ కారణంగా నాపరాళ్ల వాహనాలు రవాణా కాక పోవడంతో ప్రధాన రహదారి బోసిపోయింది. సీనరేజ్ కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ రాయల్టీలను ఆన్‌లైన్‌లో కాకుండా మాన్యువల్‌గా బుక్‌ల రూపంలో ఇవ్వనున్నారు. ట్రాక్టర్‌కు 8 టన్నుల నుంచి 5 టన్నులకు కుదించినట్లు తెలుస్తుంది. అయినా ఒక్కో ట్రిప్పుకు రూ.1100కు పైగానే చెల్లించాల్సి రావడంతో యజమానులకు దిక్కుతోచడం లేదు.

నాపరాళ్ల ట్రాక్టర్లు అడ్డగింత

బేతంచెర్ల: బనగానపల్లె రహదారిలోని ప్రైవేట్ రాయల్టీ చెక్ పోస్టు వద్ద సిబ్బంది ఆదివారం బేతంచెర్ల పట్టణంలోకి వస్తున్న నాపరాళ్ల ట్రాక్టర్లను అడ్డుకున్నారు. రాయల్టీలు ఉంటేనే పంపిస్తామని లేకపోతే పంపమని తెలపడంతో నాపరాళ్ల ట్రాక్టర్లు అన్నీ నిలిచిపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాపరాళ్ల పరిశ్రమలకు రాయల్టీలు ఇస్తుండగా ప్రస్తుతం ప్రైవేటుకు అప్పగించడంతో బనగానపల్లె రహదారిలో చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రైవేటుకు అప్పగించడమే కానీ ఇంత వరకు గనుల యజమానులకు రాయల్టీలు ఇవ్వలేదు. రాయల్టీలు జారీ చేయకుండా ఇలా అడ్డుకుంటే తమ పరిస్థితి ఏంటని ట్రాక్టర్ల డ్రైవర్లు, లోడింగ్ కార్మికులు వాగ్వాదం చేయడంతో సిబ్బంది వదిలి వేశారు.